క్లుప్తంగా

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



గాలాయగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రభాకర్

దెందులూరు: దూరదృష్టితో భారతదేశ ఆహార భద్రతకు చర్యలు తీసుకున్న గొప్ప మహా నీయుడు, పాలనాదక్షుడు మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం గాలాయగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



రాచూరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష

ఉంగుటూరు: రాచూరు గ్రామంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు కస్తూరి శిరీష మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, అన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు సలహాలు అందించారు. 150 మంది హైస్కూల్ విద్యార్థులకు ఇమ్యూనిటీని పెంచే మందులు అందించారు. 190 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు.

గడువులోగా పంట నమోదు చేయాలి



పెదపాడులో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ శైలజ

పెదపాడు : పంట నమోదు గడువులోగా పూర్తి చేయాలని ఏలూరు వ్యవసాయ అధికారి జి.శైలజ తెలిపారు. పెదపాడు మండలం కొత్తూరు, ముప్పర్రు, పెదపాడు గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన గడువులోపు పంట నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెదపాడు ఏఓ వి.ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు



గాయపడిన కొవ్వలి గ్రామస్తుడు జాన్

దెందులూరు: జాతీయ రహదారిపై ఏలూరు బైపాస్ ఆశ్రం వద్ద ద్విచక్రవాహనంపై ఏలూరు వెళ్తున్న కొవ్వలి గ్రామానికి చెందిన మేరుగ జాన్‌ను గుర్తు తెలియని కారు ఢీ కొట్టి వెళ్లిపోయింది. స్థానికులు, హైవే పోలీసుల కథనం మేరకు జాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ని హైవే పోలీసులు అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

ఉచిత వైద్య శిబిరం



చేబ్రోలు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు

ఉంగుటూరు: చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం మాతృదేవో భవ చారిటబుల్ ట్రస్టు (హైదరాబాదు) ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యులు కేఎస్ వర్మ, శ్రావణరెడ్డి వైద్య సేవలు అందించారు. ప్రతి నెలా ఆఖరి శనివారం ఈ ట్రస్టు ద్వారా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు సమన్వయ కర్త ప్రశాంత్ తెలిపారు.

వ్యాయామ కళాశాలలో క్రీడా ప్రాజెక్టు మీట్

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఆవరణలో శనివారం క్రీడా ప్రాజెక్టు మీట్ నిర్వహించారు. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 800 మీటర్లు, ఐదు కిలో మీటర్ల పరుగు పందెం, షార్ట్ పుట్, డిస్క్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిబుల్ జంప్, జావలిన్ త్రో పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సత్తానియేలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు.



కఠిన చట్టాలు రావాలి



విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు, దౌర్జన్యాలు జరిగినప్పుడు కారకులను శిక్షించే చట్టాలు చాలా కఠినంగా ఉండాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలను మార్చాలి. దాడి, దౌర్జన్యం చేయాలన్నే ఆలోచనే రాకుండా చట్టాలను కఠినతరం చేయాలి. గత పరిస్థితులకు అనుగుణంగా పాతకాలం నాటి చట్టాలు న్నాయి. పూర్తిగా చట్టం అనే పేరే తప్ప శిక్ష, భయపడటం, ప్రభావం చూపడం లేవు. చట్టాలంటే భయంపుట్టేలా ఉండాలి. **– డాక్టర్ సుందర్, సూపరింటెండెంట్, దెందులూరు సీహెచ్‌సీ**

ఆందోళనలో ఉన్నాం




నిత్యం ఏం జరుగుతుందో.. ఏం చేయాలనే భయంతో వైద్య సిబ్బంది ఉన్నారు. మేము ఎలా ఉంటున్నామో అని మా కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మార్పు తీసుకురావాలి. కుటుంబ సభ్యులు మాదిరిగా ప్రభుత్వం అమలు చేసే అన్ని ఆరోగ్య సంక్షేమ పథకాలు, సర్వేలు ఇలాంటి ఘటనల నేపథ్యంలో ఎలా చేయాలి. ఇళ్లకు వెళ్లాలంటే మనస్సులో ఏదో తెలియని ఆందోళన.
– వీవీ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, దెందులూరు

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్లు

- రూ.2.50 కోట్లతో గతంలో ఏర్పాటు
- భారత్ కంపెనీకి నెలకు రూ.5 లక్షల వరకు ఖర్చు
- కూటమి ప్రభుత్వంలో నిర్వహణ గాలికి

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఒకవైపు ప్రజలకు సరైన వైద్య సేవలు అందే పరిస్థితి కనిపించకపోగా, మరోవైపు ప్రజా ధనం వృథాగా ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేలా అధికారుల తీరు కనిపిస్తోంది. ఈ జీజీహెచ్‌పై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారించకపోవటంతో ప్రజలకు ఆధునిక వైద్య సేవలు దూరం అవుతున్నారు. ప్రభుత్వ ధనం ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఉందో ? లేదో తెలియని సందిగ్ధత నెలకొంది. అభివృద్ధి కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించాల్సిన జిల్లా కలెక్టర్ జీజీహెచ్ వైపు చూడకపోవటంతో అధికారులు చెప్పిందే వేదంగా మారింది. ఏలూరు జీజీహెచ్‌లో కరోనా సమయంలో 2020, 21 సంవత్సరాల్లో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా బాధితులకు ఆక్సిజన్ చికిత్సల కోసం యుద్ధప్రాతిపదికన తొలుత ఆక్సిజన్ నిల్వ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా, అనంతరం సొంతంగా జీజీహెచ్‌లో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. కేంద్రం రూ.2.50 కోట్లు నిధులు వెచ్చించగా, మరో ప్రైవేటు సంస్థ స్వచ్ఛందంగా ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు కొంత సొమ్ము వెచ్చించింది. సుమారుగా 5,500 కిలో లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ఉత్పత్తి చేసేలా ప్లాంట్స్ నిర్మించారు.



ఏలూరు జీజీహెచ్‌లో ప్రైవేటు కంపెనీ ఆక్సిజన్ నిల్వ చేసే ట్యాంక్



ఏలూరు జీజీహెచ్‌లో నిరుపయోగంగా ప్రభుత్వ ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్

కరోనా ముమ్మరంగా ఉన్న రోజుల్లో ప్లాంట్స్ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తూ వినియోగించారు. అనంతరం ఈ ప్లాంట్స్‌ను పట్టించుకునే నాథుడే లేక నిరుపయోగంగా మారిపోయాయి.

ప్రైవేటు కంపెనీకి లక్షల చెల్లింపులు

ఏలూరు జీజీహెచ్‌లో కంటి వైద్య విభాగం పక్కనే కరోనా సమయంలో సుమారు 10 వేల కిలో లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ నిల్వ చేసే భారీ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కరోనా కాలంలో రెండు రోజులకు ఒకసారి లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసేలా లిండే కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో భారత్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. వారం, 10 రోజులకు ఒకసారి ఈ ట్యాంకును నింపేలా చర్యలు చేపట్టారు. ఏలూరు జీజీహెచ్ ఆక్సిజన్ సరఫరాకు ప్రతినెలా రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు చేస్తోంది. ఇంత భారీ మొత్తంలో ఆక్సిజన్ కోసం ప్రజా ధనం వృథాగా చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పట్టించుకోని అధికారులు

ఏలూరు జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ, ట్రామాకేర్, ఎంసీహెచ్ ఇలా అన్ని విభాగాల్లోనూ సుమారుగా 620 ఆక్సిజన్ బెడ్లు ఉన్నాయి. ఈ ఆక్సిజన్ బెడ్లకు నేరుగా ప్లాంట్ల నుంచి ఆక్సిజన్ సరఫరా చేసేలా పైప్‌లైన్ వేశారు. ఇక సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను పనిచేసేలా చేస్తే ప్రైవేటు కంపెనీలకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం ఉంది. ఏలూరు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో ఎలాగూ ఆక్సిజన్ బెడ్లు వినియోగించే పరిస్థితి లేకపోవటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్పత్తి ప్లాంట్లనే వినియోగించుకునే ప్రజాధనం వృథా కాదని అంటున్నారు.

టెక్నీషియన్లను నియమించాలి



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను వినియోగించుకుంటే ప్రజాధనం ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు టెక్నీషియన్లను నియమించి, మరమ్మతులు నిర్వహించి వినియోగించుకుంటే ప్రజలకు ఉపయోగపడతాయి. అధికారులు వీటిపై దృష్టి సారించాలి.
– పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్

సద్వినియోగం చేయాలి



ఏలూరు జీజీహెచ్‌లో ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను అధికారులు సద్వినియోగం చేసుకోవాలి. గత కొంతకాలంగా నిరుపయోగంగా వదిలేయటంతో ప్రైవేటు కంపెనీ నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. సొంతంగా జీజీహెచ్ అధికారులే ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను వినియోగించుకుంటే లక్షలాది రూపాయాలు ఆదా చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలి.
– సొంగా మధు, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు

గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి

గణపవరం: గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి నెలకొంది. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామాల్లో చిన్నారులు మట్టిముంతలు చేతపట్టుకుని గుంపులు గుంపులుగా తిరుగుతూ గోవిందా.. గోవిందా.. అంటూ ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేస్తున్నారు. రోడ్లపై వాహనదారుల నుంచి చందాలు రాబాడతున్నారు. గణపవరంలో మట్టిముంత అమ్మకాలుకూడా జోరుగా సాగుతున్నాయి. వివిధ సైజుల్లో ముంతలు విక్రయిస్తున్నారు. సైజును బట్టి మట్టి ముంత ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆదివారం, సోమవారం సెలవు కావడంతో ముందుగానే కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పిల్లలు సంతోషంగా ఉట్టికొట్టారు. విజేతలకు బహుమతులు అందించారు.

పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

జల్లికొమ్మర యూపీ స్కూల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుక సందడిగా నిర్వహించారు. విద్యార్థులు గోపికలు, కృష్ణుడి వేషధారణలో అలరించారు. గోపిక, కృష్ణునికి సంబంధించిన సినీ గేయాలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టిని కొట్టేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ఉట్టి కొట్టిన 8వ తరగతి నాగరాజుకు ఉపాధ్యాయులు ప్రసాదరావు నగదు బహుమతి అందించారు. ఆది, సోమవారాలు సెలవులు కారణంగా ముందస్తుగా పాఠశాలలో కృష్ణాష్టమి వేడుక నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు.



ఉట్టి కొడుతున్న చిన్నారులు



గోపిక, కృష్ణుని నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



కృష్ణాష్టమి చందాలు వసూలు చేస్తున్న చిన్నారులు

విధి వంచితులకు మిషన్ వాత్సల్య దోహదం

పెదపాడు : వివిధ అనారోగ్యాలకు గురై మృతి చెందిన వారి సంతానానికి మిషన్ వాత్సల్య ఎంతగానో దోహద పడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో కరోనా కారణంగా మృతి చెందిన వారి పిల్లలు గార్డియన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మూడు నెలలకొకసారి కేంద్రం ఆర్థిక సాయం అందిస్తోందని, ఇది వారికి ఉపయోగపడుతున్న విధానాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, పెదపాడు ఎంఈఓ డీపీ రమణ పాల్గొన్నారు.

ప్రమాదంలో తీవ్ర గాయాలు

భీమడోలు: స్థానిక అయ్య ప్ప స్వామి గుడి వద్ద శనివారం రోడ్డు గోతిలో పడి ఓ మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుగొండ నుంచి ఏలూరు వైపుగా జంగారెడ్డిగూడెంకు చెందిన చిడిపి కల్యాణ్‌బాబు తన పల్సర్ బైక్‌పై వస్తున్నాడు. అయ్యప్ప స్వామి వారి ఆలయం వద్దకు వచ్చేసరికి రోడ్డుపై భారీ గొయ్యి వద్ద బైక్ అదుపు తప్పింది. రోడ్డుపై పడిన కల్యాణ్‌బాబుకు కంటి, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు సెఫ్టీ వెహికల్ పోలీసులు క్షతగాత్రున్ని వైద్య చికిత్స నిమిత్తం భీమడోలు ఆసుపత్రికి తరలించారు. ఆతనికి వైద్య చికిత్సను అందించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

హెల్మెట్ లేకుంటే వాహనం సీజ్



సోమవరప్పాడు జంక్షన్ వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్వామి

దెందులూరు: వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై కె.స్వామి హెచ్చరించారు. శనివారం ఆయన సోమవరప్పాడు బైపాస్ వద్ద ద్విచక్రవాహనదారులకు హెల్మెట్లు లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెల్మెట్ ధారణతో ప్రయాణం సురక్షితమని, కుటుంబం భద్రత, భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు డివిజన్ పరిధిలోని 132 కేవీ భీమడోలు – పెదవేగి ఫీడర్‌లో ప్రస్తుతం ఉన్న కండక్టర్‌ను మార్చే నిమిత్తం ఈ నెల 25వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లో వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌ను రోజుకు రెండు విడతలుగా సరఫరా చేయనున్నట్టు ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయరాయి, బాపిరాజు గూడెం, అయ్యపరాజు గూడెం, జానంపేట, పెదవేగి, కూచింపూడి, రామసింగవరం, రాయుడు పాలెం, కవ్వగుంట, ఆసన్నగూడెం, ధర్మాజీ గూడెం, ముండూరు, గాలాయగూడెం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, గుడిగుంట, జోగన్నపాలెంలలో సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతిరోజూ వ్యవసాయానికి రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతులు ఈ విషయాన్ని గ్రహించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే భీమడోలు – ఏలూరు ఫీడర్ పరిధిలోని రామారావు గూడెం, దెందులూరు, పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలను ప్రాంతాల్లో సైతం రోజుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రేపు సెయింట్ జాన్స్ విద్యాసంస్థల రజతోత్సవం

దెందులూరు: సోమవరప్పాడులోని సెయింట్ జాన్స్ విద్యాసంస్థల రజతోత్సవం ఈ నెల 26న సోమవారం నిర్వహించనున్నట్టు ఏలూరు పీఠం వికార్ జనరల్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ పి.బాల తెలిపారు. శనివారం సోమవరప్పాడు కళాశాలలో రజతోత్సవం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆదివారం కళాశాలలో పూర్వ అధ్యాపకులకు సన్మానం, ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26న సోమవారం రజతోత్సవం, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుట్టినరోజు వేడుక, కళాశాల స్థాపకోత్సవం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచ్చేస్తారని పేర్కొన్నారు.

ఎన్‌సీసీపై అవగాహన

ఉంగుటూరు: కైకరం హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులతో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసరు కల్నల్ అమిత్ పాండే, ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంటు కల్నల్ రిబేష్ సిన్హాలు శనివారం మమేకమయ్యారు. ఎన్‌సీసీ 19 ఆంధ్రా బెటాలియన్, ఏలూరుకు చెందిన ఉన్నతాధికారులు కైకరం హైస్కూల్‌ను సందర్శించారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పాఠశాలలో నిర్వహించే ఎన్‌సీసీ కార్యక్రమాలపై అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న దాత గంగాధరరావు

దెందులూరు: కోర్కెలు తీర్చే కల్పవల్లి, గాలాయగూడెం గ్రామదేవత అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి గాలాయగూడెంకు చెందిన పూజారి గంగాధరరావు కుమారుడు నాగరాజు, ఈశ్వరి దంపతులు, కుటుంబ సభ్యులు రూ.10,235 విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలకు అమ్మవారి జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూజారి వెంకటరత్నం నాయుడు, పూజారి సీతారాం, రామచంద్రావు, ఠాగూర్, తోట అచ్చియ్య, తోట అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహనకు కృషి

భీమడోలు: వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ కృషి చేస్తుందని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ లింగంపల్లి నాగమణికంఠ తెలిపారు. భీమడోలులో శనివారం వినియోగదారుల హక్కుల కమిషన్ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఎన్‌సీఆర్‌సీ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ బల్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ముఖ్య వైద్యాధికారిగా డాక్టర్ పిల్లి బాలు ప్రకాష్‌ను నియమిస్తూ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల సిటీ ఇన్‌చార్జి పోలిశెట్టి సత్యేంద్ర అధ్యక్షత సభ నిర్వహించారు. నాగమణికంఠ మాట్లాడుతూ వినియోగదారులకు వైద్య పరంగా సలహాలు, సూచనలను అందించేందుకు కమిషన్‌లోని వైద్య విభాగం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలందించే విషయంలో ఆసుపత్రుల్లోని వైద్యులు అలసత్వం వహిస్తున్నారని, వాటిని ప్రశ్నించేందుకు ఈ కమిషన్ పని చేస్తుందని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మూరి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



బాలు ప్రకాష్‌కు నియామక పత్రాలను అందిస్తున్న నాగమణికంఠ, ప్రతినిధులు

మొక్కలతోనే మానవాళి భవిష్యత్తు

గణపవరం: మొక్కలు మానవాళి జీవనానికి ముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని పలువురు సూచించారు. శనివారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1, ఎకోక్లబ్‌ల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణ, బొటానికల్ గార్డెన్‌లో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేయడం వల్లనే పర్యావరణంలో విపరీత మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ పరిస్థితిని అధిగమించాలంటే పచ్చదనాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ వెంకటరమణ, ఎకోక్లబ్ కన్వీనర్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



గణపవరం డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

ఒత్తిడిని జయిస్తేనే విజయం

గణపవరం: ఒత్తిడిని జయిస్తే విజయపథంలో దూసుకుపోవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కాలేజీలో మహిళా సాధికారత విభాగం, ఇంక్లూజివ్ సెంటర్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ సైక్రియాటిస్ట్, సైకోథెరపిస్ట్ అనంతకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండవచ్చునని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక, మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలని, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కోవడం, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం తదితర సమస్యలపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, అధ్యాపకులు చైతన్య, స్వరూపరాణి, అక్కిరాజు, వెంకటరమణ, వెంకట్రావు, శారదాదేవి, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు : స్థానిక జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ (అతిథి అధ్యాపకులు) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ఉత్తర్వుల మేరకు పెదపాడు జూనియర్ కళాశాలలో తెలుగు, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు 50 శాతం మార్కులతో సంబంధిత అంశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులకు బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని, వివరాలకు సెల్ నెంబర్ 82473 67920లో సంప్రదించాలని కోరారు.

గణపవరం జూనియర్ కాలేజీలో..

గణపవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోటనీ, వొకేషనల్ కోర్సుల అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బోటనీ పోస్టుకు బోటనీలో ఎంఎస్సీ, వొకేషనల్ పోస్టుకు బీఎస్సీ లేదా ఎంఎస్సీలో నర్సింగ్ అర్హతలు ఉండాలని, అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, సంబంధిత సబ్జెక్టుల్లో విశ్రాంత అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు.